## నేడు వాహనాల వేలం

బాలానగర్, జనవరి 22 : బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 40 వాహనాలను (ద్విచక్ర వాహనాలు, కార్లు) ఈ నెల 23న ఉదయం 11 గంటలకు బాలానగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ తెలిపారు. ఆసక్తిగలవారు రూ.2 వేల డీడీతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకువచ్చి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. సమాచారం కోసం ఫోన్: 8712658739, 9492460840, 9966636967 లలో సంప్రదించాలని కోరారు.

## స్కాలర్‌షిప్‌లు అందజేత

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22: జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో విద్యా సంవత్సరంలో ప్రతిభను చాటిన విద్యార్థులకు టీఎమ్‌టీ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. బుధవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ వి.బాలకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, టీఎమ్‌టీ ప్రతినిధి రాజీవ్‌సింగ్ బిష్ట్ చేతుల మీదుగా 16 మంది సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని, జీవితంలో వచ్చే సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, విభాగాధిపతి డిన్ కుమార్‌లు ఉన్నారు.

## 25న ఉచిత వైద్యశిబిరం

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : కేపీహెచ్‌బీ కాలనీ రెనోవా వైద్యశాల సహకారంతో ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించడం జరుగుతుందని డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మందలపు సాయిబాబా చౌదరి తెలిపారు. ఈ నెల 25న వసంతనగర్ కాలనీ (ఐడీపీఎల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ) లైబ్రరి భవనంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. డాక్టర్ ప్రసన్న గోరే పర్యవేక్షణలో ఫైబ్రోస్కాన్, హెపటైటిస్ బీ, హెపటైటిస్ సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9959673594, 93946678842 లకు సంప్రదించాలని కోరారు.

# పైప్‌లైన్ పనులు ఆపితే చర్యలు తీసుకోండి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



గోపాల్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, జలమండలి, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని గోపాల్‌నగర్ కాలనీ నుంచి ముళ్లకత్వ చెరువు వరకు ఏర్పాటు చేసే డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం గోపాల్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, జలమండలి, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గోపాల్‌నగర్ కాలనీ రోడ్డు పక్కన చేస్తున్న పైప్‌లైన్ పనులకు కొద్దిమంది ప్లాట్ యాజమానులు అభ్యంతరం చెప్పడం సరికాదన్నారు. గోపాల్‌నగర్ లేఅవుట్ ప్రకారం రోడ్డు పక్కన స్థలం జలమండలికి సంబంధించిందని, జీహెచ్‌ఎంసీ మాస్టర్ ప్లాన్‌లో ఈ రోడ్డును 200 ఫీట్లు గా గుర్తించడం జరిగిందన్నారు. ఈ రోడ్డులో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను అడ్డుకునే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. పనులకు ఆటంకం కలిగించిన వ్యక్తుల డాక్యుమెంట్లను పరిశీలించాలన్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి మండలాల రెవెన్యూ అధికారులు డాక్యుమెంట్లను పరిశీలించాలని, తగిన విధంగా మార్కింగ్ చేసి, రిపోర్టును జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు అందజేయాలన్నారు. పైప్‌లైన్ పనులను ఆపిన వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలోపు పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన..అధికారులను ఆదేశించారు. ఈ పనులతో గోపాల్‌నగర్ వాసులకు మేలు జరుగుతుందని, డ్రైనేజీ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కాలనీ వాసులందరూ కలిసి పనులను పూర్తిచేసేలా అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి, జలమండలి జీఎం ప్రభాకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మోహ్రా, డీఈ శంకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వడ్డెర సంఘం ప్రతినిధులు

## వడ్డెరుల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, జనవరి 22 : వడ్డెరుల సంక్షేమాభ్యున్నతికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపాలిటీ ఉమామహేశ్వర కాలనీలో వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ వడ్డెర సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన స్పందించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కుల సంఘాలకు ప్రభుత్వ భూములను కేటాయించి ప్రత్యేక నిధులతో వారి అభ్యున్నతికి కృషి చేయడం జరిగిందని, వడ్డెర సంఘం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తన సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, కొంపల్లి ఉమామహేశ్వర కాలనీ వడ్డెర సంఘం ప్రతినిధులు వల్లెపు అంజయ్య, బోసు సుధాకర్, స్వామి, వెంకటేశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# స్థలాల వేలంపాటపై ఉత్కంఠ..!

- కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో స్థలాల వేలంపాటకు అధికారులు ఏర్పాట్లు..
- అడ్డుకుంటామని స్థానికుల హెచ్చరికలు..
- ఆగుతుందా..? సాగుతు ందా..? అని ప్రజల్లో జోరుగా చర్చ..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో హౌసింగ్ బోర్డు చేపట్టే స్థలాల వేలంపాట సజావుగా సాగుతుందా...? ఆగుతుందా...? అన్న ఉత్కంఠ స్థానిక ప్రజల్లో నెలకొంది. రాష్ట్ర వ్యాప్తం గా ఉన్నటువంటి హౌసింగ్‌బోర్డు ఖాళీ స్థలాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టగా...దీనిలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని నార్త్, వెస్టన్ డివిజన్ ల పరిధిలోకి వచ్చే 31 స్థలాలను బహిరంగ వేలంద్వారా విక్రయించాలని నిర్ణయించారు. హౌసింగ్ బోర్డు వెస్టన్ డివిజన్‌లో 24స్థలాలకు ఈ నెల 24న, నార్త్ డివిజన్‌లో 7 స్థలాలకు ఈ నెల 30న వేలంపాట నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మరోవైపు గుడి, బడి, ప్రజల అవసరాల కోసం వదిలిన చిన్నిచిన్న బిట్లను సైతం అమ్మకానికి పెట్టడంపై స్థానిక ఎమ్మెల్యే, కా ర్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ స్థలాలను వ దిలేసి...ఆయా ప్రాంతాల్లో గుడి, బడి కోసం, ఇతర కమ్యూనిటీ అవసరాల కోసం వదిలిన 3,5, 6, 10 గజాల స్థలాలను వేలానికి పెట్ట డం సరికాదంటున్నారు. మార్కెట్ ధరను మించి గజం ధరను రూ.1.25 లక్షలుగా నిర్ణయించడం, జీవో నంబర్ 6 ప్రకారం... పక్కవారికి కాకుండా ఇతరులకు అమ్మకానికి పెట్ట డం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత పదేండ్ల కాలంలో హౌ సింగ్ బోర్డు స్థలాలను కాపాడి, పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేశామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతుందని పలువురు విమర్శించారు. ప్రజా అవసరాల కోసం వదిలిన 10 శాతం ఖాళీ స్థలాలను చూపించాలని, గుడి, బడి, పార్కులు, ప్రజల అవసరాల కోసం వదలిన చిన్నచిన్న స్థలాలను విక్రయించడం మానుకోవాలని, పేదవారికి ప్రభుత్వ ధర ప్రకారం స్థలాలను ఇవ్వాలని కోరుతున్నారు. ఆ స్థ లాలు కొనుగోలు చేస్తే.. నిర్మాణం చేయకుండా అడ్డుకుంటామ ని, ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ప్రజలతో కలిసి వేలంపాటను అడ్డుకుంటామని పలువురు హెచ్చరికలు చేశారు. దీంతో హౌసింగ్ బోర్డు స్థలాల వేలంపాటపై కాలనీలో జోరుగా చర్చసాగుతుంది.

### స్థలంపై కోర్టు స్టే..

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో అమ్మకానికి పెట్టిన స్థలంపై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కోర్టును ఆశ్రయించడంతో ఆ స్థలాన్ని వేలంవేయడం ఆపాలని కోర్టు ఉత్వర్వులు జారీ చేసింది. పలు ప్రాంతాల్లో అమ్మకానికి పెట్టిన స్థలాలపై స్థానికుల నుంచి అభ్యంతరా లు ఉన్నాయి. ఈ స్థలాలపై కోర్టును ఆశ్రయించడానికి పలువురు సిద్ధపడుతున్నారు. ఆ యా కాలనీల్లో లేఅవుట్ ప్రకారం... 10 శా తం ఖాళీ స్థలాలను చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## ఫుడ్ తయారీ కేంద్రాల తనిఖీ

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ)/ దుండిగల్ : నాణ్యతా ప్రమాణాలు పాటించని ఫుడ్ తయారీ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్, సూరారం డివిజన్ , శ్రీరామ్‌నగర్‌లోని పలు పిండివంటలు, స్వీట్లతయారీ కేంద్రాలను మేయర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా పలు షాపుల్లో తయారుచేసి అమ్మకానికి ఉన్న నాణ్యత లేని సరుకులు, అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్న పిండివంటకాలు, ఆహారపదార్థాల తయారీలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడాన్ని గుర్తించారు. కొన్ని సరుకులకు ఎక్స్‌పైరీ తేదీ లేకపోవడం, కాలపరిమితి ముగిసిన సరుకులు నిల్వచేయడంపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయా తయారీ కేంద్రాలపై తగిన చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మేయర్ వెంట హెల్త్ అడిషనల్ కమిషనర్ పంకజ, జీహెచ్‌ఎంసీ ఫుడ్ అసిస్టెంట్ కంట్రోలర్ ముత్యంరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీకాంతం, చీఫ్ సీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ షకీల్, తదితరులు ఉన్నారు.

## 30లోగా ఇందిరమ్మ ఇండ్ల విచారణ పూర్తి చేయాలి : డీసీ

మియాపూర్ , జనవరి 22 : ఈ నెల 30లోగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణను పూర్తి చేయాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. సర్కిల్ వ్యాప్తంగా ఇప్పటికే దరఖాస్తు దారుల జాబితాను అందించామని, అర్హులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై బుధవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, సర్వేయర్లు, నోడల్ అధికారులతో డీసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్కిల్‌లో మొత్తం 24 వేల దరఖాస్తులకుగాను ఇప్పటికే 14 వేల వాటిపై విచారణ పూర్తయిందని, మిగిలిన వాటిపైనా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుదారుల్లో ఎవరైన మృతి చెందితే సర్వే బృందానికి సమాచారం అందించాలని అన్నారు. జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి అర్హతను విచారించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎం మహాసభలను జయప్రదం చేద్దాం ..

దుండిగల్, జనవరి 22: ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేద్దామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. బుధవారం సూరారం డివిజన్, షాపూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు, పేదప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం రాజీలేని పోరాటాలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పేదల ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం అర్హులైన వారి పెన్షన్ల కోసం, కార్మిక హక్కులు, చట్టాల రక్షణ కోసం ఉద్యమాలు కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయడంతోపాటు 25న జరిగే బహిరంగ సభను విజ యవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సీపీఎం మండల కమిటీ సభ్యులు సత్యం, పార్టీ సీనియర్ నాయకులు వెంకన్న, ఆంజనేయులు, సునీల్, బీరప్ప, నర్సింగ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీ పరీక్షల విభాగాన్ని ప్రక్షాళ న చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ పరీక్షల విభాగంలో అక్రమాలకు పాల్పడుతున్న పరీక్షల విభాగం అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్ ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ పరీక్షల విభాగం అవకతవకలను నిరసిస్తూ.. ఏబీవీపీ ఆధ్వర్యంలో వర్సిటీ పరిపాలన భవనం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరీక్షల్లో పాస్ చేయించడం కోసం పరీక్షల విభాగం అధికారులు లక్ష రూపాయలు తీసుకుంటున్నారని ఆరోపించారు. పరీక్షల విభాగంలో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో అడిషనల్ కంట్రోలర్‌గా ఉన్న వ్యక్తిని ఇప్పుడు ఇన్‌చార్జి కంట్రోలర్‌గా నియమించారని, దీనివల్ల సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందని, వర్సిటీ పరీక్షల విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావులు స్పందించి... తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ కో కన్వీనర్ నాగరాజు, రాష్ట్ర కార్యసమితి సభ్యుడు పూజిత్, వర్సిటీ అధ్యక్షుడు శ్రీరామ్, కార్యదర్శి శివమణి, లేఖజ్, రిషీ, సుశాంత్ ఉన్నారు.

---

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు ..



9వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న దుండిగల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణికృష్ణ

దుండిగల్, జనవరి 22 : ప్రజా సంక్షేమ మే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని దుండిగల్ పురపాలక సంఘం చైర్‌పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి, 9వ వార్డు, డీ.పోచంపల్లిలోని సురక్ష మెడోస్‌లో రూ.10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనుల కు, అదే విధంగా మాధవరావు నగర్‌లో రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్ బండారి మహేందర్ యాదవ్‌తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బస్తీలు/కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో ము న్సిపాలిటీలో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శామీర్‌పేట్ రంగయ్య, జనరల్ సెక్రటరీ కొల్తూరు మల్లేశ్ ముదిరాజ్, కాలనీ ప్రెసిడెంట్, సీనియర్ నాయకులు వేణుగౌడ్, కాలనీ ప్రెసిడెంట్ కనకారావు, సభ్యులు భూపతిరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

## ఆరోగ్యం, ఒత్తిడిని జయించడంపై సూచనలు



చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసిద్ధ మనోవైద్యుడు చైతన్య వర్మ

దుండిగల్, జనవరి 22 : సూరారంలోని ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు ఎదుగుదల వయసు, మానసిక ఆరోగ్యం, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే మార్గాలపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైల్డ్ సైకాలజీ, మానసిక ఆరోగ్యం విశ్లేషకుడిగా ప్రసిద్ధి గాంచిన మనోవైద్యుడు(సైకాలజిస్ట్) చైతన్య వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు పరీక్షల ద్వారా ఒత్తిడిని జయించడంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ తులసీ కుమారి నంద , చైర్మన్ శిరీశ్ తుర్లపాటి, డైరెక్టర్ రాధిక తుర్లపాటి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బేబీకి మిడ్‌గట్ వాల్వులస్ శస్త్రచికిత్స విజయవంతం



సమావేశంలో పాల్గొన్న వైద్య బృందం

కొండాపూర్, జనవరి 22 : పిత్త వాంతులు, మూత్రం తగ్గడం లక్షణాలతో దవాఖానలో చేరిన ప్రీమెచ్యూర్ (నెలలు నిండకుండా పుట్టిన) శిశువుకు హైటెక్‌సిటీలోని మెడికవర్ దవాఖాన వైద్యులు మిడ్‌గట్ వాల్వులస్ శస్త్ర చికిత్సను నిర్వహించి ప్రాణాలు కాపాడారు. చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం దవాఖానలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్యులు మధుమోహన్‌రెడ్డి వెల్లడించారు. ప్రీమెచ్యూర్ బేబి (36 నెలలు) పిత్త వాంతులు, మూత్రం తగ్గడం వంటి లక్షణాలతో దవాఖానలో చేరింది. అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్ ఇమేజింగ్ ద్వారా పరీక్షలు నిర్వహించగా, మిడ్‌గట్ వాల్వులస్, మాల్ రోటేషన్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. వైద్య బృందం 4 గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని, నోటి ద్వారా ఆహారం సైతం తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య బృందంలో డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ నవిత ఎం, డాక్టర్ వంశీరెడ్డిలు ఉన్నారు.

## 25న మేడ్చల్ జిల్లా పురుషుల కబడ్డీ జట్టు సెలక్షన్స్ ..

దుండిగల్, జనవరి 22 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమిలో ఈ నెల 25న జిల్లా పురుషుల కబడ్డీ జట్టు సెలక్షన్స్ నిర్వహించనున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ చంద్రహాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పనిసరిగా జిల్లాకు చెందినవారై ఉండాలని, 85కేజీలు, అంతకన్నా త క్కువ బరువు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. సెలక్షన్స్‌లో పాల్గొనదలిచిన ఔత్సాహికులు తమ ఆధార్‌కార్డు ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. సెలక్షన్స్‌లోఎంపికైన జట్టు సభ్యులు అదిలాబాల్‌లో ఫిబ్రవరి 4 నుంచి 7ల మధ్య నిర్వహించే 70వ సీనియర్ పురుషుల అం తర్ జిల్లా కబడ్డీ ఛాంపియన్‌షిప్ పో టీల్లో పాల్గొంటారన్నారు. శనివారం మధ్యాహ్నం 2 నుంచి సెలక్షన్స్ మొదలవుతాయన్నారు. ఎంపిక ప్రక్రియ మొత్తం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అ ధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ సమక్షంలో జరుగుతుందని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్: 73967 49998లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు సామగ్రి అందజేత

మియాపూర్, జనవరి 22 : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూతను అందించడం అభినందనీయమని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు అన్నారు. దాతల తోడ్పాటును సద్వినియోగం చేసుకు ని విద్యలో మరింతగా రాణించాలన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జడ్పీ ఉన్న త పాఠశాలలో ఐడీబీఐ బ్యాంకు సౌజన్యంతో కంప్యూటర్ టేబుళ్లు, చైర్లు, ఆంప్లిఫయర్, స్పీకర్ సెట్, బీరువాలు సహ వంట సామగ్రి ని బుధవారం బ్యాంకు ఆర్ఏహెచ్ సందీప్ పట్నాయక్, డీజీఎం మురళీధర్‌లతో కలిసి కార్పొరేటర్ అందించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద, ప్రైవేటు సంస్థలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో వసతులు కల్పిస్తూ పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహన్నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్డుల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

### ఇబ్బందులకు గురిచేయడమే ప్రజాపాలనా : కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



వివేకానందనగర్ వార్డు కార్యాలయంలో రేషన్‌కార్డు దరఖాస్తుదారుతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రోజాదేవి

మియాపూర్ , జనవరి 22 : రేషన్ కార్డుల దరఖాస్తుల పేరిట విరుద్ధ ప్రకటనలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతున్నదని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు కొత్త దరఖాస్తులు అందివ్వాలని చెబుతుంటే వార్డు కార్యాలయాల్లో స్వీకరణకు తమకు ఎటువంటి మార్గదర్శకాలు లేవని అధికారులు చెబుతుండటం వారిమధ్య సమన్వయ లోపానికి విస్పష్ట నిదర్శమన్నారు. రేషన్ కార్డులు లేనివారు 21 నుంచి 24 వరకు వార్డు కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తులు అందించాలని ఎమ్మెల్యే గాంధీ ప్రకటన చేయడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వార్డు కార్యాలయానికి రాగా.. అధికారులు మాత్రం దరఖాస్తుల స్వీకరణపై తమకు ఎటువంటి సూచనలు అందలేదని అంటున్నారు. ఈ క్రమంలో బుధవారం కార్పొరేటర్ రోజాదేవి వివేకానందనగర్ వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ .. దరఖాస్తుల స్వీకరణపై తమకు ఎటువంటి సూచనలు అందలేదని దరఖాస్తుదారులను తిప్పి పంపిస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రకటనలకు క్షేత్రస్థాయి ఆచరణకు ఏమాత్రం పొంతనలేదని కార్పొరేటర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమన్వయ లోపం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కనీసం 40 శాతం కూడా పూర్తి చేయలేదని కార్పొరేటర్ అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే ప్రజాపాలనా ? అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను అయోమయానికి గురిచేసే విరుద్ధ ప్రకటనలను మానుకోవాలని రోజాదేవి హితవు పలికారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి



నిజాంపేట్ కార్పొరేషన్ భవ్యాస్ ఆనందంలో జరిగిన వార్డుసభలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్,కార్పొరేటర్ రజితారవికాంత్



దరఖాస్తులను స్వీకరిస్తున్న దుండిగల్ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు

దుండిగల్, జనవ 22 : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్, భవ్యాస్ క్లబ్ హౌస్, 15వ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లోని నల్లపోచమ్మ గుడివద్ద బుధవారం నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభ ల్లో డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 9,10,11వ డివిజన్‌లలో 128 మంది నిరుపేద కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవని గుర్తించడంతో పాటు 74మంది నిరుపేదలకు ఇండ్లు లేనట్లు గుర్తించినట్లు తెలిపారు.15వ డివిజన్‌లో 325 మందికి రేషన్ కా ర్డులు అందించాలని, స్థలం ఉన్న 72 మందికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించాలని, 505మందికి ఇందిరమ్మ ఇండ్లు పొందే అర్హులను గుర్తించినట్లు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో 9వ డివిజన్ కార్పొరేటర్ రంజిత ర వికాంత్, కార్పొరేటర్లు గాజుల సుజాత, బాలాజీ నాయక్, కో–ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీశ్, బాచుపల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

***దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో...***

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 8 నుంచి 14వార్డుల్లో బుధవారం ప్రజాపాలన వార్డు సభలను నిర్వహించారు. ఈ సభల్లో ఇప్పటికే దరకాస్తు చేసుకుని వివిధ పథకాలకు ఎంపికైనవారి లిస్టులను వెల్లడించడంతోపాటు నూతనంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 1,518, రేషన్‌కార్డుల కోసం 1334, రైతుభరోసాకు 17 వరకు దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్‌డీవో శ్యాంప్రకాశ్, మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరావు, వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వార్డు సభలు

కుత్బుల్లాపూర్, జనవరి 22 : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రెండవ రోజు 7,8,9,10,11,12వార్డుల్లో సభలు కొనసాగాయి. ఆయా వార్డుల పరిధిలో ఏ ర్పాటు చేసిన శిబిరాల్లో స్థానిక ప్రజలు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరో సా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, టీపీసీసీ కార్మిక విభాగం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కందారి సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ ఆదిరెడ్డి రాజిరెడ్డి, ఎ.రజినీ, టి.కృష్ణవేణి, డి.శిరీషాతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## దరఖాస్తు కోసం నిరీక్షణ..

### అందుబాటులో లేని సిబ్బంది

జగద్గిరిగుట్ట, జనవరి 22 : ప్రభుత్వ ం ప్రచారం చేసినంతగా అధికారులు సమాచారం ఇవ్వడంలేదని పలువురు పేదలు వాపోతున్నారు. జగద్గిరిగుట్ట వార్డుకార్యాలయం వద్ద బుధవారం స్థానికులు రేషన్‌కార్డులు, ఇండ్ల దరఖాస్తు కోసం రాగా నిరాశ ఎదురైంది. ఉదయం వచ్చినవారు మధ్యాహ్నం వరకూ ఎదరుచూసినా కార్యాలయం తాళం తీయలేదు. నలుగురు సిబ్బంది ఉండగా ఎవరూ అందుబాటులో లేరు. ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్‌కు కొందరు, మరోవార్డు విధులకు మరికొందరు వెళ్లారు. కనీసం నోటీసుబోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు..

కొండాపూర్, జనవరి 22 : ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం –2025 కార్యక్రమానికి ఆర్టీఏ కొండాపూర్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన జేకేఏ కరాటే పోటీలు

శేరిలింగంపల్లి, జనవరి 22: గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ (జేకేఏ) అధ్వర్యంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న ఇండియా ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్–2025 కరాటే పోటీలు బుధవారం ముగిశాయి. అంతర్జాతీయంగా దాదాపు 1200 క్రీడాకారులు పాల్గొన్న ఈ కరాటే పోటీల్లో విజేతలుగా 18 సంవత్సరాల పురుషుల విభాగంలో రష్యాకు చెందిన టిగరన్ రాష్యద్దీయన్, మహిళల విభాగంలో ఎక్తరీయాన పాల్మాచుక్‌లు ప్రథమస్థానంలో నిలిచారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సుదర్శన్, టెక్నికల్ డైరెక్టర్ దయానంద్ కుమార్‌లు విజేతలకు బంగారు పతకాలు అందజేశారు. జపాన్ కరాటే అసోసియేషన్‌కు చెందిన పులువురు ప్రముఖులు, క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

## చేరువలో వారంతపు సంత

అల్లాపూర్, జనవరి22: ప్రజలకు చేరువలో వారంతపు సంత రావడంతో అన్ని కూరగాయలతో పాటు అన్ని రకాలు అందుబాటులోకి వస్తాయని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్ధర్‌నగర్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన వారంతపు సంతను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అబ్దుల్ హమీద్, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : బాలాజీనగర్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని అపోలో మెడికల్ రోడ్డులో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జలమండలి మేనేజర్ వైష్ణవితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. .డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన పనుల్లో నాణ్యతను పాటిస్తూ... త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అంజిరెడ్డి, భాస్కర్‌రావు, కాలనీవాసులు ఉన్నారు.